క్లుప్తంగా

ముగిసిన జాతర

దుమ్ముగూడెం: మండలంలో మినీ మేడారంగా ప్రసిద్ధిగాంచిన మారాయిగూడెం గ్రామంలో దేవర బాలలు సోడి శాంతమ్మ, అచ్చమ్మల ఆధ్వర్యంలో ఐదు రోజులుగా జరుగుతున్న సమ్మక్క–సారాలమ్మ జాతర శనివారంతో ముగిసింది. ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహించిన జాతరలో భక్తులు వేలాదిగా పాల్గొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. వనదేవతలు వనం నుంచి జనంలోకి వచ్చిన నాటి నుంచి నిండు జాతర ప్రారంభం కాగా అమ్మవార్లను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాలకు చెందిన వేలాది మంది ఆదివాసీలు తమ ఇలవేల్పులను దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. శనివారం సాయంత్రం ప్రత్యేక పూజలను నిర్వహించి అమ్మవార్లను వనంలోకి తీసుకెళ్లడంతో జాతర ముగిసింది.

ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ల సమావేశం

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామంలో తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఫెడరేషన్ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ మండల అధ్యక్షుడు సూరిబాబు మాట్లాడుతూ.. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన చింతల బాలరాజు కుటుంబానికి లేబర్ ఇన్సురెన్స్ ద్వారా వచ్చే ఆర్థికసాయం అందే విధంగా కృషి చేద్దామని, యూనియన్ తరుపున బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షుడు బిలపాటి రాజు, కార్యదర్శి వందవాసు రాము, కోశాధికారి ముక్కెర రాంబాబు, కార్యవర్గ సభ్యులు నిట్ట అబ్బులు, ముక్కెర పృథ్వీ, కోడి భద్రం, సోంపాక రాజు, రామకృష్ణ, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ..

ములకలపల్లి: మండలపరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు శనివారం భూమిపూజ చేశారు. మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ సున్నం సుధాకర్, మాజీ ఎంపీటీసీ జుబ్బూరి అక్కులు, శనగపాటి రవి, సురభి రాజేశ్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

చంద్రుగొండ: మండలంలోని బెండాలపాడు శివారు కనకగిరి గుట్టలపై జరగనున్న శివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాల్సిందిగా ఉత్సవ కమిటీ కోరింది. ఉత్సవాల పోస్టర్‌ను ఎస్సై మాచినేని రవి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ఉత్సవాలను ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వర కల్యాణం

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత బాలాజీ వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా జరిపించారు. స్వామి వారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

సామూహిక సీమంతాలు

అశ్వాపురం: ఐటీసీ సహకారంతో మమత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. పోషకాహారం, ఎనిమియా నివారణ, పోషకాహార లోపంపై అవగాహన కల్పించారు. ఎంపీటీసీ సభ్యుడు కమటం నరేష్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, మమత సంస్థ సిబ్బంది హరిప్రియ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని ఓబీ కంపెనీలో పనిచేస్తున్న కార్మికుల జీతాల పెంపుదల కోసం ఐఎన్‌టీయూసీఓబీ కాంట్రాక్ట్ వర్కర్ యూనియన్ నాయకులు శనివారం ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. జీతాలు పెంచాలని పలుమార్లు అడిగినా ఓబీ కంపెనీ యాజమాన్యాలు స్పందించని తీరును వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే దుర్గా ఓసీ–2, దుర్గా ఓసీ–4, మహాలక్ష్మి ఓబీ కంపెనీల యాజమాన్యాలతో మాట్లాడి జీతాల పెంపు అగ్రిమెంట్ గురించి చర్చిస్తానని హామీనిచ్చారు.

రైతుబంధు ఇవ్వాలి

ములకలపల్లి: రైతుల ఖాతాల్లో వెంటనే రైతుబంధు డబ్బు జమ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గౌరినాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల కార్యదర్శివర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. వేసంగి పంటలకు 24 గంటలూ నిరంతరాయంగా విద్యుత్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ప్రభుత్వమే సబ్సిడీపై ఎరువులు, పురుగుమందులు అందించాలన్నారు. మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, నాయకులు పాడియం వెంకటేశ్వర్లు, ఊకంటి రవికుమార్, రావూజా పాల్గొన్నారు.

కొలిమితో చెలిమి!

- సొంత ఊరిని వదిలివచ్చిన మధ్యప్రదేశ్ వాసులు
- కొలిమిని నమ్ముకుని వలస
- ఏటా ఎనిమిది నెలలు బయటే..



భట్టుపల్లి గ్రామంలో పనిముట్లు కొనుగోలు చేస్తున్న స్థానికులు



కొలిమి పనిలో నిమగ్నమైన మధ్యప్రదేశ్ వాసులు

సండే స్పెషల్

కరకగూడెం: రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాలు వారివి. ప్రదేశం ఎదైనా కష్టపడే తత్వం వారిది. వారసత్వంగా వస్తున్న కొలిమి వృత్తిపై తరతరాలు ఆధారపడుతూ వస్తున్నారు. చేతివృత్తిని నమ్ముకొని సొంత గ్రామాలను వదిలి బతుకు జీవనం కోసం ఏడాదిలో 8 నెలలు వలసలోనే గడుపుతున్నారు. వారే కొలిమి పని చేసుకుంటున్న మధ్యప్రదేశ్ వాసులు.

గ్రామ శివార్లే ఆవాసాలుగా మార్చుకుని వారానికో ఊరు తిరుగుతూ కొలిమిపని చేసుకుంటూ జీవిస్తున్నారు. మొచ్చు పారలు, కొడవళ్లు, గొడ్డళ్లు తయారు చేస్తూ జీవన గమనాన్ని సాగిస్తున్నారు. చేతి వృత్తిపై ఆధారపడి వివిధ రాష్ట్రాలో తిరుగుతూ బతుకు వెళ్లదీస్తున్నారు.

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయం ఇతరత్ర పనులు సరిగా లేకపోవడంతో కొలిమి పనికి ఫలితం తక్కువగా ఉంటుంది. అదే మన తెలుగు రాష్ట్రాల్లో నిత్యం వ్యవసాయం, పాడి ఇతర పనుల కోసం వీరు చేసే పనిముట్లు అధికంగా ఉపయోగిస్తుండటం వీరికి అందివచ్చిన అవకాశం. దీంతో కొలిమి వృత్తిని నమ్ముకొని వలసబాట పట్టి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలు బృందాలుగా వచ్చారు. ప్రతి ఏటా ఎండాకాలం, చలికాలం వలస వస్తుంటారు. పనిలో ఆడ, మగ తేడాలు లేకుండా నిమగ్నమవ్వడం వీరి ప్రత్యేకత. గొడ్డలి, కొడవలి, కత్తులు, పారలు, సుత్తి, తయారు చేసి విక్రయించి వాటితో వచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తుంటారు. వానకాలంలో మాత్రం తమ గ్రామాలకు చేరుకుంటారు.

కొలిమినే నమ్ముకున్నాం..



యేళ్ల తరబడి కొలిమి వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. చిన్నా, పెద్దా తేడా లేకుండ మా సొంత ప్రాంతాల నుంచి తట్టాబుట్టా సర్దుకుని ఇక్కడికి వచ్చాం. మేము చేసే పనిలో ఫలితం ఉండడంతో మాకు సంతోషంగా ఉంది. వానకాలంలో మాత్రమే మేము మా సొంత గ్రామాలకు వెళ్తుంటాం.

– లోహర్ మోహన్ సింగ్, మధ్యప్రదేశ్

మగవారితో సమానంగా కష్టపడతాం..



కొలిమి పనిలో మగవారితో మేము సమానంగా పనిచేసి పనిముట్లు తయారు చేస్తాం. మా దగ్గర ఈ వృత్తికి సరైన ఆదరణ లభించకపోవడంతో ఏడాదిలో 8 నెలలు వలస వస్తుంటాం. కొన్ని ప్రదేశాల్లో ఉండడానికి చాల ఇబ్బంది పడ్డా కుటుంబం అంతా పనుల్లో నిమగ్నమవుతాం.

– లోహర్ లాడ్ బాయ్, మధ్యప్రదేశ్

వచ్చినప్పుడల్లా ఆదరిస్తాం..



మధ్యప్రదేశ్ వాసులు ప్రతి రోజు గంటల కొద్ది శ్రమించి వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తారు. వారి కష్టానికి తగ్గ ప్రతిఫలం దొరుకుతుంది. వలస వచ్చినప్పుడల్లా మేము వారి కష్టానికి తగ్గ ధరకు పనిముట్లు కొని ఆదరిస్తుంటాం. వీరు తయారు చేసే పనిముట్లు ఎంతో ధృడంగా మన్నికంగా ఉంటాయి.

– బొంగొని గణేష్, కరకగూడెం

ఎమ్మెల్యే విస్తృత పర్యటన



పాకలగూడెంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మండల పరిధిలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని లచ్చాపురం, మల్కారం, పెద్ద గొల్లగూడెం, పార్కలగండి, అంకంపాలెం, పట్వారిగూడెం, బాలరాజుగూడెం, జగ్గారం తదితర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమం ద్వారా లబ్ధిదారులకు చెక్కులను అందజేయడం జరుగుతుందన్నారు. పాకలగూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు వడ్డించే ఆహార నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం ఆరగించారు. ఈ కార్యక్రమాలలో తహసీల్దార్ నరేష్, ఎంపీపీ సాయం ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, అత్తులూరి వెంకటరామారావు, కక్కిరాల రమేష్, శ్రీరాముల ప్రసాద్, కేవీ సత్యనారాయణ, పగడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

మణుగూరురూరల్: మండలంలో ఇంటర్ పరీక్షలను నిర్వహిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, కృష్ణవేణి జూనియర్ కళాశాల కేంద్రాలను శనివారం మణుగూరు డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని, ప్రతీ ఒక్కరిని తనిఖీ చేసిన తర్వాతనే కేంద్రాల్లోకి అనుమతించాలని సూచించారు. విద్యార్థులకు తగిన వసతులు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వేలంపాట

ములకలపల్లి: సీతారాంపురం శివారులో రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుకను శనివారం బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈప్రదేశంలో అక్రమంగా నిల్వచేసిన 15 ట్రాక్టర్ల ఇసుక (37 క్యూబిక్ మీటర్లు)కు సంబంధించి వడ్డే హన్మంతరావు రూ.30,928లకు దక్కించుకున్నట్లు ఆర్ఐ తారాచంద్ తెలిపారు.

స్టేషనరీ వితరణ

కరకగూడెం: అఖండ హిందూ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కేజీబీవీ, కరకగూడెం, భట్టుపల్లి, అనంతారం జెడ్పీ పాఠశాలల 51మంది పదవ తరగతి విద్యార్థులకు శనివారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లను కరకగూడెం తహసీల్దార్ నాగప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. ఏజెన్సీలో సేవా కార్యక్రమాలు చేస్తున్న సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కట్ల నరేష్, సీహెచ్.నగేష్, సీరిశెట్టి కమలాకర్, చందా మధు, సాయి ప్రసాద్, గిరి అయ్యగారు, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బూర్గంపాడు: ఐటీసీలో శనివారం జరిగిన కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధురాలికి రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థికసాయమందించారు. క్లబ్ అధ్యక్షుడు జయంత్‌కుమార్ దాస్, కార్యదర్శి కేవీఎస్ గోవిందరావు, రోటరీ, ఐటీసీ ప్రతినిధులు చెంగలరావు, డాక్టర్ విజయ్‌కుమార్, చాంద్‌బాషా, నాగమల్లేశ్వరరావు, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

నేడే పల్స్ పోలియో..

పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నేడు నిర్వహించనున్నారు. పుట్టిన పిల్లల దగ్గర నుంచి ఐదేళ్లలోపు బాలలందరికీ పోలియో చుక్కలు వేయనున్నారు. అందుకోసం ఆయా ప్రాంతాల్లో పలు సెంటర్లను ఏర్పాటు చేశారు. వైద్య, అంగన్‌వాడీ, ఆశాల సంయుక్త సిబ్బంది కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ విషయంపై శనివారం దాదాపు అన్ని ప్రాంతాల్లో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీలు, మానవ హారాలు నిర్వహించింది. స్థానిక డాక్టర్లు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



చర్లరూరల్: చర్లలో మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



భద్రాచలంఅర్బన్: పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తూ..



ములకలపల్లి: ప్లకార్డులతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు, వైద్యసిబ్బంది

వరకట్న వేధింపులపై కేసు

భద్రాచలంఅర్బన్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో వరకట్న వేధింపుల కేసు నమోదైంది. పట్టణంలోని సుందరయ్య నగర్ కాలనీకి చెందిన లకావత్ శాంతి అనే మహిళకు ఏడాది క్రితం జూలూరుపాడుకి చెందిన వ్యక్తితో పెళ్లి జరిగింది. ఇటీవల కాలంలో శాంతి భర్త వీరన్న అదనపు కట్నం కోసం తనను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని శనివారం భద్రాచలం పోలీస్‌స్టేషన్‌లో శాంతి ఫిర్యాదు చేసింది. దీంతో వీరన్న కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై విజయలక్ష్మి తెలిపారు.

దాడి కేసు..

భద్రాచలంఅర్బన్: స్థానిక పోలీస్‌స్టేషన్ శనివారం దాడి కేసు నమోదైంది. భద్రాచలం గ్రామ పంచాయతీలో ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న దుర్గారావుని, అదే గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పనిచేస్తున్న కాపుల లక్ష్మణ్ అనే వ్యక్తి అకారణంగా దాడి చేసి గాయపరుస్తున్నాడని దుర్గారావు ఫిర్యాదు చేశాడు. దీంతో లక్ష్మణ్‌పై టౌన్ ఎస్సై విజయలక్ష్మి కేసు నమోదు చేశారు.

రామచంద్రాపురం వాసులకు టీజీటీ పోస్టులు

ములకలపల్లి: గురుకుల విద్యాసంస్థల్లో ట్రైన్డ్ గ్యాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) ఉద్యోగాలకు మండల పరిధిలోని రామంద్రాపురం గ్రామానికి ఇద్దరు యువకులు ఎంపికయ్యారు. శుక్రవారం విడుదలైన తుదిఫలితాల్లో గ్రామానికి చెందిన బొలుసుపాటి అప్పారావు (టీజీటీ తెలుగు), జుబ్బూరు శ్రీనివాసరావు (టీజీటీ సోషల్) అర్హత సాధించారు. ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు టీజీటీలు ఎంపిక కావడంపట్ల మాజీ సర్పంచ్ సున్నం సుధాకర్, గ్రామస్తులు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

5న మహిళలకు ఆటల పోటీలు

మణుగూరుటౌన్: ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మార్చి 5వ తేదీన సాయంత్రం 5గంటల నుంచి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు డీజీఎం (పర్సనల్) సలగల రమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సింగరేణి యువతులకు, మహిళలకు నిర్వహించే ఈ పోటీలలో టగ్ ఆఫ్ వార్, బాల్ త్రో, బాల్ ఇన్ బాస్కెట్, బాంబ్ ఇన్ సిటీ తదితర క్రీడలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రీడలకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీఓకు సన్మానం

గుండాల: మండలాభివృద్ధితో పాటు ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఎంపీఓ హజరత్ వలీ ఎంతగానో కృషి చేశాడని ఎంపీపీ ముక్తి సత్యం అన్నారు. గుండాల నుంచి చర్ల మండలానికి బదిలీపై వెళ్లిన ఆయనకు శనివారం స్థానిక గ్రామ పంచాయతీలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు, ప్రజాప్రతినిధుల మమేకమై పనిచేశారని గుర్తు చేశారు. మాజీ సర్పంచ్ కొమరం సీతారాములు, ఉప సర్పంచ్ మానాల ఉపేందర్, ఎంపీటీసీ క్రిష్టారావు, కొమరం శాంతయ్య, కార్యదర్శి రామ్మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను అమలు చేస్తాం



మణుగూరుటౌన్: గృహజ్యోతి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చి పార్టీపై ప్రజలకున్న విశ్వసనీయతను కాపాడుకుంటామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కూనవరం పంచాయతీ పరిధిలోని హరిజనవాడలో విద్యుత్, ఎంపీడీఓ అధికారులతో కలిసి గృహజ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వస్తోందన్నారు. మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, ఏడీఏ జీవన్‌కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీవో పల్నాటి వెంకటేశ్వరరావు, ఏఈ వేణుగోపాల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను ప్రజాభవన్ కార్యాలయంలో శనివారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. 25 మందికి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, గుడిపూడి కోటేశ్వరరావు, గణేశ్‌రెడ్డి, బాబ్‌జానీ, చింతల కృష్ణ, పాతూరి వెంకన్న, రెవెన్యూ అధికారులు కృష్ణ, నర్సింహారావు తదితరులు ఉన్నారు.

గుండాల: కరెంటును పొదుపుగా వాడుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, ఆళ్లపల్లి వైఎస్ ఎంపీపీ రేసు ఎల్లయ్యలు అన్నారు. శనివారం గృహజ్యోతి పథకంలో భాగంగా గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో జీరో కరెంటు బిల్లు జారీ ప్రక్రియ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎంపీటీసీ కృష్ణారావు, మాజీ సర్పంచ్ కొమరం సీతారాములు, ఏఈలు రమేష్ బాబు, లైన్‌మెన్లు రమేష్, జగన్, పవన్, శ్రీను పాల్గొన్నారు.

అశ్వాపురం: మండల కేంద్రంలోని మంచికంటినగర్, నెల్లిపాక గ్రామ పంచాయతీలో గృహజ్యోతి పథకంలో భాగంగా రెండు వందల యూనిట్ల లోపు జీరో విద్యుత్ బిల్లులను లబ్ధిదారులకు శనివారం ఎంపీపీ ముత్తినేని సుజాత అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ మణిదీప్, ఎల్ఐ ప్రసాద్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖధీర్, ఎంపీటీసీలు కమటం నరేష్, గాదె జయ, నాయకులు అచ్యుతరామారావు, బిక్కసాని సత్యనారాయణ, వలబోజు మురళీకృష్ణ, గాదె వెంకటేశ్వర్లు, వర ప్రసాద్, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

బూర్గంపాడు: ఎన్నికల హామీల అమలులో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన గృహజ్యోతి కార్యక్రమం శనివారం సారపాకలో ప్రారంభించారు. 200 యూనిట్లలోపు కరెంట్ వినియోగిస్తున్న వారికి జీరో విద్యుత్‌బిల్లులను శనివారం విద్యుత్ శాఖ అధికారులు అందించారు. విద్యుత్‌శాఖ ఏఈ ఉపేందర్ ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ సిబ్బంది వినియోగదారులకు జీరో బిల్లులను అందించారు.

మాజీ స్పీకర్ జయంతి



శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీఓ, ఐటీడీఏ అధికారులు

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో శాసనసభ స్పీకర్‌గా వ్యవహరించి, ఎస్సీ, ఎస్టీ జాతుల అభ్యున్నతికి కృషి చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన మహనీయుడు దివంగత నేత శ్రీపాదరావు అన్ని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ డేవిడ్ రాజ్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం దివంగత నేత మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ..పేద ప్రజల అభివృద్ధికి ఆయన చేసిన సేవలకు గుర్తుకుగా తెలుగు జాతికి ఆయన పేరు గుర్తుండే విధంగా గత ప్రభుత్వం శ్రీపాద పేరుతో ప్రాజెక్ట్ నిర్మించిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఎస్‌ఓ సురేస్‌బాబు, శ్రీనివాస్, వెంకటేశ్వరరాజు, వీరు నాయక్, నరసింహారావు, అరుణకుమారి, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరురూరల్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను శనివారం శ్రీవిద్యాభ్యాస (బాలవెలుగు) పాఠశాలలో, కూనవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తొలుత శ్రీపాదరావు చిత్రపటానికి సింగరేణి జీఎం కార్పొరేట్ లలిత్‌కుమార్ దంపతులు, ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావులు పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. శ్రీపాదరావు జయంతి సందర్భంగా శ్రీవిద్యాభ్యాస పాఠశాలలో సింగరేణి జీఎం (కార్పొరేట్) లలిత్‌కుమార్–అనిత దంపతుల ఆధ్వర్యంలో విద్యార్థులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శ్రీపాదరావు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాల్లో శ్రీవిద్యాభ్యాస పాఠశాల కరస్పాండెంట్ బి.జగన్మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుహాసినిదేవి, కళావతి, స్వాతి, రాధ, సింగరేణి సేవా సమితి సభ్యులు నాసర్‌పాషా, కూనవరం పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం టౌన్ సీఐగా సంజీవరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. గత నెల 13న బదిలీపై సీఐ వెంకటేశ్వర్లును బదిలీపై కొత్తగూడెం నియోజకవర్గం చుంచుపల్లికి పంపడంతో ఆ స్థానంలో సంజీవరావును నియమించారు. ఈ సందర్భంగా సీఐ సంజీవరావు మాట్లాడుతూ.. శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పని చేస్తామని, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ పోలీస్ శాఖకు సహకరించాలని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన సీఐకు టౌన్ ఎస్ఐలు శ్రీనివాస్, పీవీఎన్ రావు, విజయలక్ష్మి, స్టేషన్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

అశ్వాపురం: అశ్వాపురం నూతన సీఐగా అశోక్‌రెడ్డి శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. నూతన సీఐకి ఎస్సైలు సురేష్‌కుమార్, తిరుపతిరావు అభినందనలు తెలిపారు. సీఐ అశోక్ రెడ్డి మణుగూరులో డీఎస్పీ రవీందర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన సీఐ విలేకరులతో మాట్లాడుతూ.. మండలంలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

అంగన్‌వాడీలకు సెలవులు ఇవ్వాలి

మే నెల మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించాలని అంగన్‌వాడీ టీచర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాలను సీడీపీఓ, సూపర్‌వైజర్లకు అందజేశారు. ఎండలు అధికమవడం వల్ల మార్చి12 నుంచి ఒక్కపూట మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించేందుకు అనుమతించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



అశ్వారావుపేట: ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



బూర్గంపాడు: సీడీపీఓకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



దుమ్ముగూడెం: సీడీపీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో ఆదివారం ఎటపాక సబ్ స్టేషన్ పరిధిలో 132 కేవీ లైన్ కి సంబంధించి ఉన్న మరమ్మత్తులు కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రాజారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా మరమ్మతులను చేస్తున్నట్లు, అందునిమిత్తమే కరెంట్ కట్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.